

శేషవాహనంపై నీలకంఠుడు
చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల్లో సోమవారం తెల్లవారుజామున స్వామివారిని శేషవాహనంపై ఊరేగించారు. - 10లో



'పోస్టల్ పొదుపు' పేదలకు వరం
గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు పోస్టల్ శాఖ అందిస్తున్న పొదుపు పథకాలు వరంగా మారనున్నాయి. - 10లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
30°/19°
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'నవోదయ' దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవటానికి గడువును ఫిబ్రవరి 8వ తేదీ వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్ కేవీ నాగరాజకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా భీమార్జున్‌రెడ్డి



రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కోర్టులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదిగా నిమ్మల భీమార్జున్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులుగా ఎం.లెనిన్‌బాబు, ఎం.ప్రమీలను నియమించారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ ఎస్.గోవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా ప్రధాన జడ్జి బీఎస్.జగ్జీవన్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా నియామకమైన న్యాయవాదులు జిల్లా కోర్టులోని వివిధ కోర్టుల్లో క్రిమినల్ కేసుల్లో అవసరమైన వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తారు.

గుత్తాను కలిసిన ఎస్పీ



గుత్తా సుఖేందర్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఎస్పీ అపూర్వరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్క అందజేశారు. జిల్లా ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఎస్పీకి గుత్తా సూచించారు.

ప్రారంభానికి సిద్ధం చేయండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

హాలియా, కొండమల్లేపల్లి, పెద్దఅడిశర్లపల్లి: అనుముల మండలంలో ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసిన స్కూళ్లలో అన్నిరకాల మౌలిక వసతులు కల్పించి ఫిబ్రవరి 2న ప్రారంభించడానికి సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. మనఊరు–మనబడి కార్యక్రమం కింద ఎంపికైన కొత్తపల్లి, పంగవానికుంట తండా ప్రాథమిక పాఠశాలతోపాటు కొండమల్లేపల్లి మండలం గుడితండా, పెద్దఅడిశర్లపల్లి మండలం అక్కంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించి మనఊరు–మనబడి పనులను పరిశీలించారు. పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా చోట్ల ఆమె మాట్లాడారు. ఆమె వెంట కొండమల్లేపల్లి, పీఏపల్లి ఎంపీడీఓలు బాలరాజురెడ్డి, మోహన్‌రెడ్డి, ఆయా మండలాల విద్యాధికారులు బాలునాయక్, మాత్రనాయక్, తరి రాము, డీఈ భాస్కర్, ఏఈ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, వాసికర్ల రమేష్, సునీత, గుడితండా, అక్కంపల్లి సర్పంచ్‌లు అంజలి రాంబాబునాయక్, కల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ నేనావత్ కృష్ణ, పీఆర్ డీఈ, ఏఈ, ఉపాధ్యాయులు ఉన్నారు.

మినీ డెయిరీ యూనిట్ల లబ్ధిదారులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

నల్లగొండ: మినీ డెయిరీ యూనిట్ల ఏర్పాటుకు ఎంపికైన జిల్లాలోని ఎస్సీ నియోజకవర్గాలైన నకిరేకల్, తుంగతుర్తికి చెందిన లబ్ధిదారులకు సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, జేడీఏ అంబటి యాదగిరి, ఎల్‌డీఎం శ్రామిక్, ఎస్‌బీఐ, ఏపీజీవీబీ మేనేజర్లు, మదర్‌డెయిరీ మేనేజర్, నకిరేకల్, చిట్యాల ఎంపీడీఓలు, బ్యాంకు మేనేజర్లు ఏఈఓ రాజు పాల్గొన్నారు.

సైబర్ క్రైం.. అరికడతాం



కమ్యూనిటీ పోలీసింగ్

కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యేలా కార్యక్రమాలు రూపొందిస్తాం. వనపర్తి జిల్లాలో మహిళలకు ట్రాక్టర్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించాం. పాఠశాలల్లో బాలికలకు కరాటే నేర్పించాం. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చాం. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ఇచ్చిన శిక్షణతో 220 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అలాంటి కార్యక్రమాలు ఈ జిల్లాలోనూ నిర్వహిస్తాం. నల్లగొండ పెద్ద జిల్లా కాబట్టి రాజకీయంగా, సామాజికంగా అన్ని సమస్యలపై స్టడీ చేసి కార్యాచరణ రూపొందిస్తా.

- సైబర్ వింగ్ పటిష్టతకు ప్రత్యేక చర్యలు
- ప్రతి శుక్రవారం ఎస్సై, సీఐలతో సమీక్ష
- ప్రజావాణిలోనే కాదు.. మిగతా రోజుల్లోనూ కలువొచ్చు
- ఫోన్, వాట్సాప్‌లో ఫిర్యాదు వచ్చినా చర్యలు చేపడతా
- రాజకీయ, సామాజిక సమస్యలపై స్టడీ చేసి కార్యాచరణ రూపొందిస్తా
- ప్రొఫెషనల్‌గా పనిచేసిన సిబ్బందికి రివార్డు ఇస్తా
- 'సాక్షి'తో ఎస్పీ అపూర్వరావు

ప్రతినిధి, నల్లగొండ: 'నేను చదువుకున్నది బీటెక్ కంప్యూటర్ సైన్స్. టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మూడేళ్లు పనిచేసిన అనుభవం ఉంది. కాబట్టి జిల్లాలో సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తా. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో స్మార్ట్ ఫోన్ల వాడకం, అందులో ఎలాంటి లింక్స్ క్లిక్ చేయొద్దు... డాటా పాస్‌వర్డ్స్ ఎలా పెట్టుకోవాలి, తెలియకుండా ఒకవేళ క్లిక్ చేసి డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే చేపట్టాల్సిన చర్యలు ఏంటన్న వాటిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తాం...' అని జిల్లా ఎస్పీ అపూర్వరావు చెప్పారు. సైబర్ క్రైం చూసే టీమ్స్‌ను బలోపేతం చేస్తామని, వారికి శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి శుక్రవారం లేదా మరో రోజు ఎస్సై, సీఐల ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహిస్తామన్నారు. సైబర్ మోసానికి గురైన ఐదు నిమిషాల్లో బాధితులు 1930కి ఫోన్ చేసి చెబితే వెంటనే చర్యలు చేపడతామన్నారు. వారి డబ్బులు పోకుండా ట్రాన్సాక్షన్ ఫ్రీజ్ చేస్తామని, ఆ తరువాత ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో ఇన్వెస్టిగేషన్ చేపడతామని ఆమె పేర్కొన్నారు. సోమవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన అంశాలు ఆమె మాటల్లోనే..

24 గంటలూ అందుబాటులో ఉంటా..

ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటాను. సమస్యలపై ఎప్పుడైనా ఫోన్ చేయొచ్చు. ప్రజావాణి సోమవారం ఉంటుంది. సోమవారం రాలేని పరిస్థితి ఉంటే ఫోన్‌లో, వాట్సాప్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు చేపడతాం. బాధితులు సోమవారమే కాకుండా మిగతా రోజుల్లోనూ వచ్చి కలువొచ్చు. గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులపై తదుపరి ఫాలోఆప్ ఉండేలా సమీక్షించేందుకు హెడ్ క్వార్టర్స్‌లో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి మానిటర్ చేస్తాం. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటి నివారణకు చర్యలు చేపడతాం. స్పీడ్ గన్స్ ఏర్పాటు చేస్తాం. సీసీ కెమెరాల పనితీరును మెరుగుపరుస్తాం. సీసీ కెమెరాల సంఖ్యను పెంచుతాం. తద్వారా దొంగతనాలు కంట్రోల్ చేస్తాం.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు

రౌడీయిజం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెడతా. గంజాయి, గ్యాంబ్లింగ్ వంటి నేరాలపైన కఠినంగా వ్యవహరిస్తాం. సీనియర్ ఆఫీసర్లతో కలిసి పనిచేస్తాం. పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి త్వరగా చార్జీషీట్ వేసేలా చూస్తా. కోర్టు కేసుల్లో త్వరగా శిక్షలు చర్యలు చేపడతాం.

మహిళా సమస్యలపై సీరియస్‌గా వ్యవహరిస్తా

మహిళలకు సంబంధించిన సమస్యలపై సీరియస్ వ్యవహరిస్తా. ఉమెన్ సేఫ్టీకి ప్రథమ ప్రాధాన్యం. వేధింపులు, హత్యలు, అత్యాచార సంఘటనల్లో నిందితులకు కచ్చితంగా శిక్షపడేలా చూస్తాం. మహిళలు, యువతులు, మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు.



క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

పోలీసుల పనితీరును పరిశీలిచేందుకు రెండు, మూడు వారాల్లో అన్ని పోలీస్ స్టేషన్లను సందర్శిస్తా. సమావేశాలు నిర్వహించి.. నేరాలు తగ్గించేందుకు కృషి చేస్తా. 'ఐయామ్ వెరీ ప్రొఫెషనల్ ఎట్ వర్క్..' ప్రజలతో సిబ్బంది కూడా డీసెంట్‌గా మసలుకోవాలి. బాధితుల పట్ల ఓపిగ్గా వ్యవహరించాలి. ఒకటికి రెండుసార్లు వారి సమస్యలు వినాలి. ప్రొఫెషనల్‌గా పనిచేస్తే రివార్డు ఇస్తా. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు.



వరద కాల్వ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి, సుందరీకరణ, రహదారుల విస్తరణ, మీడియన్, డ్రెయినేజీలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డితో కలిసి సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలో పర్యటించి అభివృద్ధి పనులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదే విధంగా మిర్యాలగూడ రోడ్డు, సాగర్ రోడ్డు, రాక్‌హిల్స్ కాలనీ ప్రాంతాల్లో రూ.6 కోట్లతో నిర్మించనున్న వరద కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి, ఈఈ రాములు, డీఈలు వెంకన్న, అశోక్‌కుమార్, నరసింహారెడ్డి, కౌన్సిలర్లు పున్న గణేష్, అభిమన్యు శ్రీనివాస్, ఖయ్యూంబేగ్, గోగుల శ్రీనివాస్, ధనలక్ష్మి, ప్రదీప్‌నాయక్, వివిధ పార్టీల నాయకులు కంకణాల నాగిరెడ్డి, ఇబ్రహీం, రావుల శ్రీనివాస్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, కంచర్ల ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును పక్కాగా నిర్వహిస్తున్నాం

నల్లగొండ: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్ర మంత్రులు, సబితాఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి కలెక్టర్లతో వివిధ అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, అటవీశాఖ కన్జర్వేటర్ శివాణి డోగ్రా, డీఎఫ్ఓ రాంబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, డీఎంహెచ్ఓ కొండల్‌రావు, డీఈఓ భిక్షపతి, ఉద్యానవన శాఖ అధికారి సంగీత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పటిష్టతకు కృషి



జెండాను ఎగురవేస్తున్న శంకర్‌నాయక్

మిర్యాలగూడ: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలంతా కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం ఏఐసీసీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా మిర్యాలగూడలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఆయన కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగుర వేసి మాట్లాడారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి, పగిడి రామలింగయ్య, ముదిరెడ్డి నర్సిరెడ్డి, పొదిల శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడు చాంద్‌పాషా, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ.సలీం, ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ మెరుగు శ్రీనివాస్, అర్జున్, సైదులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

- ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు విన్నవించిన బాధితులు



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి (గ్రీవెన్స్ డే)కి వినతులు వెల్లువెత్తాయి. పలు మండలాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతి పత్రాలు సమర్పించారు. మా సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. వినతి పత్రం సమర్పించేందుకు వచ్చిన మిర్యాలగూడకు చెందిన మూర్ఛ బాధితురాలు భూక్య అరుణ కళ్లు తిరిగి పడిపోయిన ఘటన చోటుచేసుకుంది. దీంతో ఆమెను సిబ్బంది పక్కకు కూర్చోబెట్టి నీరు తాగించడంతో కొద్దిసేపటికి తేరుకుంది. అనంతరం ఆమె తనకు పింఛన్ కోసం వినతి పత్రం అందజేసింది.

అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలి

అనంతరం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో ఆయన పాల్గొని ప్రజల నుంచి 67 అర్జీలను స్వీకరించి మాట్లాడారు. ఇందులో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ధరణి, దళిత బంధు, సదరం సర్టిఫికెట్‌లు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇతర శాఖలకు సంబంధించిన విజ్ఞప్తులు వచ్చాయి. తనకు పింఛన్ ఇవ్వాలని ప్రమాదంలో కాలు విరిగి 75శాతం వైకల్యం సర్టిఫికెట్ పొందిన నల్లగొండ మున్సిపల్ పరిధిలోని కతాల్‌గూడెంకు చెందిన తాటికొండ సాంబ వినతిపత్రం అందజేశారు. అలాగే మా అన్న కుమారులు పట్టా చేయించుకున్న తన భూమిని ఇప్పించాలని మర్రిగూడకు చెందిన బొజ్జ ఇద్దయ్య కోరారు. ఇంకా కొండమల్లేపల్లిలో సర్వేనంబర్ 107లో ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో తమకు ఇళ్లపట్టాలు ఇచ్చారని, ప్రస్తుతం అందులో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారని సదరు భూమినే మాకే కేటాయించాలని నాయీబ్రాహ్మణ సంఘం నేతలు కోరారు.

ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తు గడువు పెంపు

ఆన్‌లైన్ చేసుకోని వారికి ఫిబ్రవరి 1 వరకు అవకాశం

- మెడికల్ బోర్డులో ముగిసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- ఏడాది క్రితం న్యూరో సర్జరీ అయిన వారివి తిరస్కరణ

నల్లగొండ: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఫిబ్రవరి 1వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు సోమవారం విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 28నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. అయితే 30వ తేదీ వరకు గడువు ఉండగా ఆన్‌లైన్‌లో తలెత్తుతున్న ఇబ్బందుల దృష్ట్యా దరఖాస్తుల గడువును పొడిగించారు. అయితే ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని ఉపాధ్యాయులకు గడువు పెంపు కలిసి రానుంది. అయితే ఫిబ్రవరి 1 నుంచి మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ప్రత్యేక కేటగిరీ కలిగిన వారికి సంబంధించి సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయడం ప్రారంభించారు. ఎడిట్ ఆప్షన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత డీఈఓ కార్యాలయంలో హార్డ్ కాపీలు సమర్పించాల్సి ఉంటుంది. కాగా ఇప్పటి వరకు 3,512 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.



మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా

ముగిసిన మెడికల్ బోర్డు సర్టిఫికెట్ల పరిశీలన

బదిలీలకు జీఓ నంబర్ 5 ప్రకారం కొన్ని వ్యాధుల బారిపడిన ఉపాధ్యాయులకు బదిలీ అయ్యేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మూడు రోజులు నుంచి 11 మంది డాక్టర్లతో ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డు డీఈఓ కార్యలయంలోనే మెడికల్ సర్టిఫికెట్లు పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు మొత్తం 103 మంది సర్టిఫికెట్ల పరిశీలకు హాజరు కాగా అందులో 70 మంది ఉపాధ్యాయులవి ఓకే కాగా 33 మందివి తిరస్కరణకు గురయ్యాయి.

ఏడాది క్రితం న్యూరో సర్జరీ అయిన వారికి నో చాన్స్

జీఓ నంబర్ 5 ప్రకారం కిడ్నీ, గుండె వ్యాధుల బారిన పడిన ఉపాధ్యాయులకు బదిలీల్లో కొంత సడలింపు అవకాశం ఇస్తున్నారు. అయితే ప్రస్తుతం న్యూరో చికిత్స పొందుతున్న వారికి కూడా అవకాశం ఇచ్చినప్పటికీ ఏడాది క్రితం అంటే 2021 జనవరి1కి ముందు న్యూరో సర్జరీ అయిన ఐదుగురు ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వలేదు. దీంతో వీరు మెడికల్ బోర్డు తనిఖీకి వచ్చిన అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తాను కలిసి తమ సమస్యను వివరించడంతో ఆమె వెంటనే డీఈఓ కార్యాలయానికి వచ్చి డీఈఓతో మాట్లాడారు. జీఓ వివరాలను తెలుసుకున్నారు. అయితే నిబంధనల ప్రకారం 2021 జనవరి 1వ తేదీ తర్వాత మెడికల్ బోర్డు నుంచి సర్టిఫికెట్లు పొందిన వారిని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఉండడంతో ఆ తర్వాత సర్టిఫికెట్లు పొందిన ఉపాధ్యాయలను తిరస్కరించారు.

మున్సిపాలిటీల్లో అవిశ్వాసం!

- మూడేళ్లు పూర్తి కావడంతో ఆ దిశగా అడుగులు
- చండూరులో అవిశ్వాసం పెట్టాలని అదనపు కలెక్టర్‌కు వినతి
- యాదగిరిగుట్టలోనూ కలెక్టర్‌కు విజ్ఞాపన
- హాలియా, సాగర్, దేవరకొండ మున్సిపాలిటీల్లోనూ అదే అలజడి



చండూరు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న ఐదుగురు కౌన్సిలర్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మున్సిపాలిటీల్లో అలజడి మొదలైంది. పాలకవర్గాలు కొలువుదీరి మూడేళ్లు పూర్తి కావడంతో ఉమ్మడి జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసానికి కౌన్సిలర్లు అడుగులు వేస్తున్నారు. చండూరు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టాలని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు సోమవారం నల్లగొండలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావుకు వినతిపత్రం అందజేశారు. హాలియా, దేవరకొండ, నాగార్జునసాగర్, యాదగిరిగుట్ట, చౌటుప్పల్‌లోనూ ఇదే తరహా చర్చలు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల అవిశ్వాసం పెట్టే ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక సమయంలో కొన్నిచోట్ల రెండున్నరేళ్లు ఒకరు మరో రెండున్నరేళ్లు ఇంకొకరు చైర్మన్‌గా వ్యవహరించాలన్న ఒప్పందాలు చేసుకున్నారు. దేవరకొండలాంటి చోట్ల రెండున్నరేళ్లు పూర్తయినా ఒప్పందం మేరకు వ్యవహరించకపోవడంతో గొడవలు మొదలయ్యాయి. నిబంధనల ప్రకారం మూడేళ్లు కాకుండా అవిశ్వాసం పెట్టడానికి వీల్లేదు. ఇటీవల ఆ గడువు ముగియడంతో పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాసం పెట్టేందుకు కౌన్సిలర్లు రంగం సిద్ధం చేస్తున్నారు. వాస్తవానికి మున్సిపాలిటీల్లో అవిశ్వాస కాలపరిమితిని నాలుగేళ్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గవర్నర్ ఆమోదం కోసం ఆ ఫైలును పంపించింది. ప్రస్తుతం అది పెండింగ్‌లో ఉండటంతో.. పాత నిబంధనల ప్రకారం మూడేళ్లు పూర్తి కావడంతో అవిశ్వాసానికి కౌన్సిలర్లు మొగ్గు చూపుతున్నారు.

చండూరులో చైర్మన్, వైస్ చైర్మన్‌పై..

చండూరులో చైర్మన్, వైస్ చైర్మన్‌పైనా అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు ముందుకొచ్చారు. అక్కడ మొత్తం 10 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో 5 మంది అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన అన్నెపర్తి శేఖర్, కొండేటి మారయ్య, కాంగ్రెస్ పార్టీకి చెందిన మంచుకొండ కీర్తిసంజయ్, బీజేపీకి చెందిన అనంతుల మంగమ్మ, గుంట వెంకటేశ్వర్‌రావు అవిశ్వాసం కోసం వినతి పత్రం అందజేశారు.

చైర్మన్‌ను దింపేందుకు పావులు

దేవరకొండలో చైర్మన్ ఎన్నిక సమయంలో ఆలంపల్లి నర్సింహ, హనుమంతు వెంకటేష్‌గౌడ్ ఒక్కొక్కరు రెండున్నరేళ్లు చైర్మన్‌గా ఉండాలని ఒప్పందం చేసుకున్నారు. ముందుగా ఆలంపల్లి నర్సింహకు చైర్మన్ పదవి దక్కింది. రెండున్నరేళ్లు పూర్తయినా ఒప్పందం ప్రకారం ఆయన తప్పుకోలేదు. ఈ విషయంలో అంతర్గంగా ఇద్దరి మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ విషయాన్ని వెంకటేష్‌గౌడ్ మంత్రి కేటీఆర్ వరకు తీసుకెళ్లారు.

నందికొండలో నేడో రేపో..

నందికొండ(నాగార్జునసాగర్) మున్సిపాలిటీలో కూడా అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. నేడో రేపో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానానికి విజ్ఞాపన పత్రం అందజేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. మున్సిపల్ చైర్మన్ పనితీరు, ఆయన అవలంభిస్తున్న వైఖరిపై బీఆర్ఎస్‌కు చెందినవారే అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అక్కడ 12 మంది కౌన్సిలర్లు ఉండగా, ఒకరు చనిపోవడంతో ఇప్పుడు 11 మంది ఉన్నారు. అందులో 9 మంది బీఆర్ఎస్, ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు. బీఆర్ఎస్‌లోని మెజారిటీ కౌన్సిలర్లే అవిశ్వాసం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

సాగర్‌లో చర్చించిన హాలియా కౌన్సిలర్లు

హాలియాలో మున్సిపాలిటీలోనూ అవిశ్వాసానికి కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. ఇటీవల పలువురు కౌన్సిలర్లు నాగార్జునసాగర్‌లో మకాం వేసి చర్చించారు. అక్కడి 12 వార్డుల్లో ఐదుగురు బీఆర్ఎస్, ఆరుగురు కాంగ్రెస్, ఒక స్వతంత్ర కౌన్సిలర్ టీఆర్ఎస్‌లో చేరడంతో వారి సంఖ్య ఆరుగురికి చేరింది. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి చైర్మన్ అయ్యారు. ప్రస్తుత చైర్మన్ పనితీరును విమర్శిస్తూ ఇటీవల మున్సిపల్ సమావేశాన్ని బహిష్కరించారు. అదేరోజు సాగర్‌కు వెళ్లి అవిశ్వాసంపై చర్చించినట్లు తెలిసింది.

యాదగిరిగుట్టలో అవిశ్వాసానికి విజ్ఞప్తి

యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ గౌడ్‌పై అవిశ్వాసం పెట్టాలని 11 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రం అందజేశారు. వారిలో బీఆర్ఎస్ పార్టీ నుంచి 6 మంది, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, సీపీఐనుంచి ఇద్దరు, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకరు ఉన్నారు. మరోవైపు మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్‌నే కొనసాగించాలని కోరుతూ పట్టణ బీఆర్ఎస్ నేతలు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిని కలిశారు.

కోదాడలో విభేదాలు

కోదాడలో అధికార పార్టీకి చెందిన నేతల మధ్యే విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. చైర్‌పర్సన్‌గా ఉన్న వనపర్తి శిరీష సంవత్సర కాలంగా మున్సిపల్ కార్యాలయానికి పెద్దగా రావడం లేదు. అన్ని కార్యక్రమాలకు ఎమ్మెల్యేనే హాజరవుతున్నారు. అక్కడ ఐదుగురు కౌన్సిలర్లు ,చైర్‌పర్సన్ వైపు ఉండగా, 20 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే వైపు ఉన్నారు. దీంతో చైర్‌పర్సన్‌ను కొనసాగిస్తారా? అవిశ్వాసం పెడతారా? అన్న చర్చ జోరుగా సాగుతోంది.

చౌటుప్పల్‌లోనూ..

చౌటుప్పల్ మున్సిపాలిటీలోనూ లుకలుకలు మొదలయ్యాయి. చైర్మన్‌గా ఉన్న వెన్‌రెడ్డి రాజు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లతోపాటు బీజేపీ, సీపీఎం కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

అదానీ షేర్ల పతనంతో సీపీఎస్ ఉద్యోగుల సొమ్ము ఆవిరి



మాట్లాడుతున్న నాగవెల్లి ఉపేందర్

నల్లగొండ టూటౌన్ : అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు పతనం కావడంతో దేశంలోని 84లక్షల సీపీఎస్ ఉద్యోగుల సొమ్ము ఆవిరైపోయిందని ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అదానీ గ్రూప్‌కు ఎల్ఐసీ, ఎస్‌బీఐ ఇచ్చిన రుణాల్లో 67 శాతం డబ్బులు సీపీఎస్ ఉద్యోగులవేనని, కమీషన్లకు ఆశపడి కార్పొరేటర్లకు లాభం చేకూరేలా వ్యవహరించడంతో ఉద్యోగులకు తీరని నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోనే అదానీ గ్రూప్ కంపెనీలకు సంబంధించి స్టాక్ మార్కెట్‌లో రూ.4లక్షల కోట్లు ఆవిరయ్యాయని, అందులో ఎల్ఐసీ రూ.18 వేల కోట్లు, ఎస్‌బీఐవి రూ.54 వేల కోట్లు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు, ప్రధాన కార్యదర్శి బొమ్మనబోయిన శ్రీనివాస్, కోశాధికారి విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ సింగ్, నల్లమేకల వెంకయ్య, పంకజ్‌రెడ్డి, కృష్ణ, ఫారూఖ్, ప్రవీణ్, చక్రపాణి పాల్గొన్నారు.

మంత్రి కాన్వాయ్ ఢీకొని వృద్ధుడికి గాయాలు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

చిట్యాల: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కాన్వాయ్‌లోని ఓ వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలయ్యాయి. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన మంచాల ఎల్లయ్య తన టీవీఎస్ ఎక్సెల్‌పై రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి వద్ద జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపునకు వెళ్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి కాన్వాయ్‌లోని చివరి వాహనం ఎల్లయ్య టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఘటన స్థలాన్ని నార్కట్‌పల్లి సీఐ శివరాంరెడ్డి, చిట్యాల ఎస్ఐ ధర్మ పరిశీలించారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

- విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ



సీనియర్స్ విభాగంలో ముకుందాపురం శాంతినికేతన్ విద్యార్థులకు మొదటి బహుమతి అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



సుధాకర్ పీవీసీ డైరెక్టర్ డాక్టర్ మీలా సందీప్‌ను సన్మానిస్తున్న సాక్షి బ్రాంచి మేనేజర్ తదితరులు

సూర్యాపేటటౌన్ : విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ వారు రీజినల్ స్పాన్సర్స్‌గా వ్యవహరిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన సీనియర్స్, జూనియర్ విభాగంలో విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికి సాక్షి మీడియా క్రీడాపోటీలు నిర్వహించడం గొప్ప నిర్ణయమన్నారు. యువత ప్రతినిత్యం తమకు నచ్చిన క్రీడలో సాధన చేయాలన్నారు. జిల్లా నుంచి దేశానికి అడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథిగా హాజరైన సుధాకర్ పీవీసీ గ్రూప్ ఆఫ్ కంపెనీ డైరెక్టర్ డాక్టర్ మీలా సందీప్ విజేతలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఉప్పల ఆనంద్, జూలకంటి జీవన్‌రెడ్డి, సంజీవనాయక్, డాక్టర్ సుధీర్, సాక్షి బ్రాంచ్ మేనేజర్ రుక్మాధర్, యాడ్స్ మేనేజర్ వెంకన్న, యాడ్స్ అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు, సిబ్బంది యాకయ్య, జానయ్య, లింగారెడ్డి, ప్రసాద్, విజయ్, వేణు, నరేందర్, శ్రీనివాస్, మధు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SUDHAKAR
PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY
Regional Sponsor

SPL SAKSHI PREMIER LEAGUE

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ..

మూడు రోజుల పాటు జరిగిన సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగింది. ఉమ్మడి జిల్లా నుంచి వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ఉత్సాహంగా మ్యాచ్‌లు ఆడారు. చివరి రోజు సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల, శాంతినికేతన్ డిగ్రీ కళాశాల ముకుందాపురం విద్యార్థుల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. రసవత్తరంగా జరిగిన ఈ పోటీలో శాంతినికేతన్ డిగ్రీ కళాశాల ముకుందాపురం టీం విజయం సాధించింది. అలాగే జూనియర్స్ విభాగంలో నాగార్జునసాగర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, మట్టపల్లి ఎస్‌సీఎల్ జూనియర్ కళాశాల విద్యార్థులు తలపడగా మట్టపల్లి ఎస్‌సీఎల్ జూనియర్ కళాశాల విద్యార్థులు గెలుపొందారు.

నిత్యం సాధన చేస్తా



సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలో పాల్గొనడం సంతోషంగా ఉంది. అలాగే ఈ టోర్నీలో తాము కప్ గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నేను ప్రతినిత్యం సాధనచేస్తా.

– ముజాహిద్, ఆల్ రౌండర్

ఇదే ఉత్సాహంతో..



సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలో ఉత్సాహంగా పాల్గొన్నా. ఈ టోర్నీలో ఆడినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఇదే ఉత్సాహంతో మరిన్ని మ్యాచ్‌లో పాల్గొని సత్తా చాటుతా..

– ఫైజ్, క్రీడాకారుడు



సీనియర్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి



జూనియర్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన సాగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు



జూనియర్స్ విభాగంలో విజేతగా నిలిచి ట్రోఫీ అందుకుంటున్న మట్టపల్లి ఎస్‌సీఎల్ జట్టు క్రీడాకారులు





ఫైనల్‌లో తలపడుతున్న శాంతినికేతన్ డిగ్రీ కళాశాల, మెడికల్ కళాశాల విద్యార్థులు

పోలీస్ గ్రీవెన్స్‌తో బాధితులకు భరోసా



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: పోలీస్ గ్రీవెన్స్ కార్యక్రమంతో బాధితులకు భరోసా కల్పిస్తున్నామని ఎస్పీ అపూర్వరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి బాధితులు అందించిన ఫిర్యాదులను ఆమె స్వీకరించి వారితో మాట్లాడారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా బాధితులకు న్యాయం చేస్తేనే పోలీసుల పట్ల గౌరవం పెరుగుతుందన్నారు.

మహిళల రక్షణకే షీటీం పోలీసులు

మహిళలకు రక్షణగా షీ టీం పోలీసులు నిరంతరం పనిచేస్తున్నార ని ఎస్పీ అపూర్వరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రాష్ట్రంలోని 8 జిల్లాలకు చెందిన షీ టీం బృందాలకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళలు నిర్భయంగా క్యూఆర్ కోడ్ స్కానింగ్, వాట్సాప్, డైల్ 100 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. మహిళల భద్రతలో జిల్లా షీటీం బృందం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని, అందుకు కృషి చేసిన సీఐ రాజశేఖర్‌ను అభినందించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే షీ టీం నల్లగొండ 9963393970, మిర్యాలగూడ 86883 88489, దేవరకొండ 9705080942 కు ఫోన్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ప్రసాద్‌రావు, డీఎస్పీ శేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, రాజశేఖర్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం



కోడి అర్జున్ (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట) : వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. చివ్వెంల, చిట్యాల మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన కోడి అర్జున్ (21) స్థానిక ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. అత్తవారి ఇంటి నుంచి వచ్చిన అర్జున్ సోదరి ఇంట్లో గదికి తలుపులకు గడియ వేసి ఉండడంతో ఇరుగుపొరుగు వారిని పిలిచింది. వారు తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే అర్జున్ మృతిచెందాడు. మృతదేహాన్ని కిందకు దించి పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రేమ వ్యవహారమే అర్జున్ ఆత్మహత్యకు కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు.



చిట్యాల: సైదులు మృతదేహం

ఏపూరులో ఖమ్మం వాసి..

చిట్యాల: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లచ్చయ్యతండాకు చెందిన భూక్యా సైదులు, తన భార్య పావని, ఇద్దరు పిల్లలతో కలిసి కొంతకాలంగా చిట్యాల మండలం ఏపూరు గ్రామంలో కూలి పనులు చేసుకుంటు ఉంటున్నారు. కాగా, ఆదివారం రాత్రి దంపతులు గొడవ పడ్డారు.అనంతరం సైదులు(30) భార్యను ఇంట్లోంచి నెట్టి వేసి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గుర్తించిన చుట్టుపక్కల వారు అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. సోమవారం మృతుడి సోదరుడు మంగిలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మా తెలిపారు.

అరెస్ట్‌కు నిరసనగా పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

బొమ్మలరామారం : మండల పరిధిలోని గద్దరాళ్ల తండాలో దొంగలు అనుకుని పోలీసులపై దాడి చేసిన ఘటనలో సోమవారం ఎనిమిది మంది గిరిజనులు అరెస్ట్ చేశారు. దీనిని నిరసిస్తూ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి నాయకత్వంలో గిరిజనులు ధర్నా, రాస్తారోకో చేశారు. రాత్రి సమయంలో ఎలాంటి సమాచారం లేకుండా తండాకు వచ్చి అక్రమంగా అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించడంతోనే దొంగలుగా భావించి దాడులు జరిగాయని పేర్కొన్నారు. తెలియని తప్పుకు బాధ్యులు చేసి అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదంటూ రెండు గంటలకు పైగా ఆందోళన చేశారు. మఫ్టీలో ఉన్నా పోలీసులపై దాడులు నిర్వహించిన వారి పైనే కేసులు నమోదు చేశామని, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని భువనగిరి రూరల్ సీఐ వెంకటయ్య, ఎస్ఐ రాఘవేందర్ గౌడ్, స్థానిక ఎస్ఐ వెంకన్న, ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డిని కోరడంతో ధర్నా విరమించారు.



ధర్నా చేస్తున్న నాయకులు, గిరిజనులు

నమ్మించి అరెస్ట్ చేశారు : ఎంపీపీ సుధీర్ రెడ్డి

దొంగలు అనుకొని మఫ్టీ పోలీసులపై దాడి జరగడం విచారకరం. తండాకు చెందిన కొందరికి కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేస్తామంటే సొంత పూచికత్తుతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చాను.కానీ పోలీసులు నమ్మించి తండా వాసులు అరెస్ట్ చేయడం సరికాదు. తన మాట మీద స్టేషన్‌కు వచ్చిన తండా వాసులును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం దారుణం.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు : సీఐ వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటయ్య

బొమ్మలరామారం : శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పోలీసు వ్యవస్థ ఉందని చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని భువనగిరి రూరల్ సీఐ, కేసు విచారణ అధికారి వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మఫ్టీలో ఉన్న పోలీసులపై విచక్షణా రహితంగా దాడులు చేసిన గద్దరాళ్ల తండా వాసులను 14 మందిని గుర్తించి 8మందిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు తెలిపారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం ఉద్దేశపూర్వకంగా పోలీసులపై దాడులు చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని, ఈ ఘటనలో నిందితుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు.అరెస్ట్ అయిన వారిలో భూక్యా చందు, భూక్యా మహిపాల్, గూగులోతు వినోద్, భూక్యా శ్రీనివాస్, భూక్యా మహేష్, భూక్యా శ్రీను, భూక్యా మీట్యా, భూక్యా లింగం ఉన్నారని తెలిపారు.

పెట్రోల్ బంకు యాజమాన్యంపై కేసు



విచారణ జరుపుతున్న అధికారులు

రాజాపేట : మండల కేంద్రంలోని బద్రినాథ్ ఫిల్లింగ్ స్టేషన్ యాజమాన్యంపై కేసు నమోదైంది. జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి సంజయ్ కృష్ణ సోమవారం పెట్రోల్ బంకును తనిఖీ చేసిన సందర్భంలో వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ తక్కువరావడం గమనించారు. నిబంధనల ప్రకారం డీజిల్ డెడ్ స్టోరేజీకి రాగానే ఆటోమేటిక్ లాక్ కాకపోవడం వల్ల వినియోగదారులు నష్టపోతున్నారని ఇండియన్ ఆయిల్ టెక్నీషియన్ కిషోర్‌కుమార్‌కు ఫోన్‌ద్వారా పరిస్థితిని వివరించారు. అనంతరం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫిబ్రవరి 4 నుంచి సదరం క్యాంపులు

–షెడ్యూల్ విడుదల చేసిన యాదాద్రి డీఆర్‌డీఏ

భువనగిరి : ఫిబ్రవరి నెలకు సంబంధించి సదరం క్యాంప్ షెడ్యూల్‌ను సోమవారం డీఆర్‌డీఏ మందడి ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు.రెన్యూవల్ దరఖాస్తుల తో పాటు కొత్తగా సర్టిఫికెట్‌కోసం సంబంధిత మండలాల్లోని మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మోకాళ్లు, వంటి నొప్పులు, వృద్ధాప్యంతో బాధపడుతున్నవారు, గుండె, కిడ్నీ, లివర్, క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, బ్లడ్ క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులన్నారు. మీ సేవ కేంద్రంలో బుక్ చేసుకున్న తేదీన మాత్రమే దివ్యాంగులు భువనగిరి ఏరియా ఆస్పత్రిలో ఆధార్, రేషన్, ఓటర్ కార్డు, ఫొటో, డాక్టర్ రిపోర్టులు తీసుకునిరావాలన్నారు.

ఫిబ్రవరిలో క్యాంపుల తేదీలు

అర్థోపెడిక్ (శారీరక లోపం) : 4,9,16,25, కంటిలోపం : 7,14,21, మానసిక రుగ్మతగలు : 6,15,22, 28, వినికిడి లోపం : 7వ తేదీ

ఆరోగ్యం, వ్యాధులపై వర్క్‌షాప్

బీబీనగర్ : మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో సోమవారం ఫిజియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్యం, వ్యాధులపై వర్క్‌షాప్ నిర్వహించారు, ప్రజల్లో ప్రబలుతున్న వివిధ రకాల వ్యాధులు, వాటి నివారణకు వైద్యం, సంపూర్ణ ఆరోగ్యం కోసం అనుసరించాల్సిన నియమాలు తదితర అంశాలపై వర్క్‌షాపులో విశ్లేషించారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ వికాస్ భాటియా, డీన్ రాహుల్‌నారంగ్, సూపర్‌డెంట్ నీరజ్‌అగర్వాల్, రీసెర్చ్ డీన్ సంగీత, వైద్యులు నితిన్‌అశోక్ జాన్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గాన్ని అనుసరించాలి



గాంధీ విగ్రహానికి పూల మాల వేస్తున్న వీసీ గోపాల్‌రెడ్డి తదితరులు

నల్లగొండ రూరల్: యువత.. గాంధీ మార్గాన్ని అనుసరించాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణారావు, విద్యార్థులు శ్రీజ, అశ్విని, హర్షిణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డికి వ్యతిరేకంగా పోస్టర్లు

నకిరేకల్: భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వ్యతిరేకంగా నకిరేకల్ మండలం చందంపల్లి శివారులో పోస్టర్లు వెలిశాయి. జాతీయ రహదారి ఫ్లైఓవర్ వంతెన కింద 13 ప్రశ్నలతో కూడిన వాల్ పోస్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అంటించారు. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో కూడా వైరల్ అయ్యింది. ఎంపీకి వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్‌పై చర్చ జరుగుతోంది. అనంతరం ముగ్గురు దుండగులు ఆ పోస్టర్‌ను చించి కాల్చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఎంపీకి వ్యతిరేకంగా పోస్టర్లు ఎక్కడా లేవని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.



చందంపల్లి ఫ్లైఓవర్ వద్ద పోస్టర్

ఇద్దరికి గాయాలు

నకిరేకల్ : బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. నకిరేకల్‌కు చెందిన పెరక జానయ్య తన స్నేహితుడు రాములుతో కలిసి బైక్‌పై నల్లగొండకు వెళ్తున్నారు. మార్గమధ్యలో తాటికల్ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో జానయ్య, రాములు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే నకిరేకల్ ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన జానయ్య, రాములు

గ్రేగోల్డ్ సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం

- బట్టి వద్ద పనిచేస్తుండగా బ్యాక్‌ఫైర్
- ఇద్దరు కార్మికులు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- మఠంపల్లిలో విషాదఛాయలు



గ్రేగోల్డ్ పరిశ్రమ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికసంఘాలు, అఖిలపక్షాల నాయకులు



మునగపాటి సైదులు (ఫైల్)



పట్టేటి సాయి (ఫైల్)

మఠంపల్లి : సిమెంట్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మఠంపల్లి మండల కేంద్రం సమీపంలో సోమవారం తెల్లవాజామున చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మునగపాటి సైదులు(46), పట్టేటి సాయి(23), మల్లెబోయిన సైదులు స్థానిక గ్రేగోల్డ్ సిమెంట్ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. రోజూవారీగా సోమవారం తెల్లవారుజామున విధులకు హాజరై కిల్న్ (బొగ్గు, కంకర, బూడిదను కాల్చే బట్టి) వద్ద పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బ్యాక్ ఫైర్ జరిగి ముగ్గురికి మంటలు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. తోటి కార్మికులు వారిని గమనించి హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మునగాల సైదులు మృతిచెందాడు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో పట్టేటి సాయి ప్రాణాలు కోల్పోగా మరో కార్మికుడు సైదులు తీవ్ర గాయాలతో కోదాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఇద్దరు కార్మికులు చనిపోవడంతో మఠంపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కార్మిక సంఘాలు, అఖిలపక్షాల ఆధ్వర్యంలో ధర్నా

గ్రేగోల్డ్ సిమెంట్ పరిశ్రమలో మూడు మాసాల క్రితం ఇదే రీతిన జరిగిన ప్రమాదంలో కార్మికుడు రెడపంగు సైదులు మృతిచెందడం, ప్రస్తుతం జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరొకరికి తీవ్రగాయాలు కావడంతో కార్మికసంఘాలు, అఖిలపక్షనాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతదేహాలను సందర్శించిన నాయకులు గ్రేగోల్డ్ పరిశ్రమ ప్రధాన గేటు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగానే కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.50లక్షల నష్టపరిహారం, పరిశ్రమలో ఉద్యోగం కల్పించాలని, ఇప్పటికైనా పరిశ్రమలో సేఫ్టీ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు పరిశ్రమ వద్దకు చేరుకుని అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు పరిశ్రమ యాజమాన్యం బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘు తెలిపారు. ఆందోళన కార్యక్రమంలో గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు కార్మికసంఘాలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.